ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 8 మే 2024 | 5





సామర్లకోటలో పెరిగిన తుప్పలు



పరదా తీయని జగన్ : కోరుకొండలో బస్ లోపల నుంచే అభివాదం

జగన్ పాతపాటే

- నీరసంగా ప్రసంగం.. కొత్త హామీల ఊసేలేదు
- జగన్ ప్రసంగం .. జనం తిరుగుముఖం
- కోరుకొండలో సీఎం సిద్ధం సభ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/కోరుకొండ/రాజానగరం/సీతానగరం, మే 7: తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన సిద్ధం సభలో సీఎం జగన్ ప్రసంగం చప్పగా సాగింది. రాజానగరం వైసీపీ అభ్యర్థి జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట ప్రధాన వీధిలో మంగళవారం సిద్ధం సభ జరిగింది. ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో అత్యధికంగా జనాన్ని తరలించారు. ఒక్కో మండలానికి 50కిపైగా బస్సులు వేసినట్టు చెబుతున్నారు. ఉదయం 10.30 గంటలకే సీఎం జగన్ సభ ఆరంభమవుతుందని చెప్పినా గంట ఆలస్యంగా 11.30 గంటలకు ఆయన ప్రసంగం మొదలైంది. 3 గంటల పాటు మండుటెండలో ప్రజలు అల్లాడిపోయారు. సీఎం జగన్ ప్రసంగం ప్రారంభించిన వెంటనే వెనుదిరిగి బస్సుల వద్దకు వెళ్లిపోయారు.జగన్ ప్రసంగంలో ఐదేళ్లలో తానెంతో చేశానని చెప్పడమే కానీ, ఒక కొత్త పథకం ఊసు ఎత్తలేదు. పాత పాటే పాడారు. చంద్రబాబుపై విమర్శలకు బాగా సమయం కేటాయించారు. తనను దెబ్బతీయడానికి సూపర్‌సిక్స్ మేనిఫెస్టో తెచ్చారని, అది అబద్ధాల మేనిఫెస్టో అని ఆయన చెప్పడానికి ప్రయత్నించారు. 1న పింఛన్లు ఇవ్వాలని కోర్టు ఆదేశించినా చంద్రబాబువల్లే సకాలంలో ఇవ్వలేదని ఆరోపించారు. కోరుకొండ ఊరులోని ఇళ్లు, షాపులు, భూములకు రిజిస్ట్రేషన్లు లేని సంగతి తెలిసిందే. ఎక్కువ భూములు దేవస్థానానికి చెందడంవల్ల గత ఎన్నికల ముందు రిజిస్ట్రేషన్లు చేయిస్తామని మాటిచ్చారు. కానీ ఎవరూ ఊహించకుండా ఎన్నికల షెడ్యూల్ ముందుగానే వచ్చేయడంవల్ల వీటి పని మధ్యలో ఆగిపోయిందని, తాను మళ్లీ నెగ్గిన తర్వాత పూర్తి చేస్తానని ప్రకటించడం గమనార్హం. ఇక్కడ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను గెలిపిస్తే ఏకంగా రాజా తల్లి, తమ్ముడుతో పాటు రాజా, గణేష్ సతీమణులు కలిపి మొత్తం ఐదుగురు ఎమ్మెల్యేలుగా పనిచేస్తారని చెప్పడం చర్చనీయాంశమైంది. వైసీపీకి ఓటు వేస్తేనే పథకాలు కొనసాగుతాయన్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో బస్సులు ఆపేయడంతో జనం నడవడానికి ఇబ్బంది పడ్డారు. జగన్ ప్రసంగం మొదలు పెట్టగానే చాలా మంది తిరుగుముఖం పట్టారు. సీఎం ప్రసంగం ముగించే సమయంలో గాలి, వాన ఆరంభమైంది. సీఎం సభ కారణంగా కోరుకొండలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ నిలిపివేశారు. దీంతో కోరుకొండ, జంబూపట్నం గ్రామస్థులు అవస్థలు పడ్డారు. సిద్ధం సభకు వచ్చిన సీతానగరం మండలం సింగవరం గ్రామానికి చెందిన మోర్త శ్యామ్‌కుమార్ వానకు తడవకుండా ఉండడానికి అంబేడ్కర్ విగ్రహం శ్లాబ్ కిందకు వెళ్లగా అది కూలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు పృథ్వీరాజ్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు.



ఉండలేం..వినలేం : సభ జరుగుతుండగానే బస్టాండ్ వద్దకు చేరిన జనం

పేదింటికి జగన్ చెద!



చూడు..గూడు : నిడదవోలులో శిథిలావస్థకు చేరిన టిడ్కో ఇళ్లు

పేదింటిని జగన్ దగా చేశాడు.. కక్షతో చెదలు పట్టించాడు.. ఐదేళ్ల కిందట తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 80 నుంచి 90 శాతం నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయించాడు.. నాలుగేళ్ల తరువాత తాపీగా ఎన్నికల వేళ లబ్ధిదారులకు ఇచ్చారు. ఏదో అంతా మేమే చేసినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారు.. అసలు విషయం చూస్తే.. అధికారం చేపట్టిన వైసీపీ కేవలం టీడీపీ ప్రభుత్వం కట్టిందన్న కక్షతో ఆ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా నాలుగేళ్ల పాటు ఆటలాడుకుంది. దాంతో గోడలు పగుళ్లివ్వడం, విద్యుత్ వైర్లు, పరికరాలు చోరీకి గురికావడం, గుమ్మాలు, ఇతర సామగ్రి దెబ్బతినడం వంటివి చోటుచేసుకున్నాయి. ఇప్పుడు అపార్ట్‌మెంట్లల్లోకి గృహప్రవేశం చేసినవారు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. సౌకర్యాలు లేక, దుర్గంధపూరిత వాతావరణంలో ఉండలేక అవస్థలు పడుతున్నారు.

- పేదల గూడు.. వైసీపీ నిర్లక్ష్యం చూడు
- టీడీపీ కట్టిందన్న కక్షతో తీవ్ర నిర్లక్ష్యం
- శిథిలమవుతున్న టిడ్కో అపార్ట్‌మెంట్లు
- సొంతిల్లు సమకూరిందన్న ఆనందం ఆవిరి
- లబ్ధిదారుల అవస్థలు
- వైసీపీ పగ ఫలితమిది



పిఠాపురంలో టిడ్కో గృహాలు

పిఠాపురాన వసతుల లేమి..

పిఠాపురం, మే 7: పేదలను జగన్ దగా చేశాడు.. ఒక్క ఛాన్స్ అంటే నమ్మి గెలిపిస్తే వారికే పంగనామాలు పెట్టాడు. పూర్తయిన ఇళ్లకు నాలుగేళ్ల చెదలు పట్టించాడు.. చివరికి రేపుమాపూ అంటూ ఎన్నికల వేళ నాలుగేళ్ల తరువాత ఇచ్చాడు. అయితే ప్రస్తుతం కొంత మంది పేదల్లో సొంతింటిలోకి వచ్చామన్న ఆనందం మచ్చుకైనా కానరావడం లేదు. అద్దె ఇంట్లోనే ఉంటే బాగుండేది. లక్షలాది రూపాయలు వడ్డీ రూపంలో నష్టపోయి కష్టాలు కొని తెచ్చుకున్నామన్న ఆవేదన వారిలో వ్యక్తమవుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని టిడ్కో అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న వారందరి పరిస్థితీ ఇదే. కనీస నిర్వహణ లేక.. సమస్యలు ఎవ్వరు పట్టించుకోక వారు ఇబ్బందులకు గురవుతున్నారు. పిఠాపురం-గోర్స రోడ్డులో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 864 అపార్ట్‌మెంట్లు నిర్మించారు. వీటిని మూడు రకాల విస్తీర్ణాల్లో నిర్మించి లబ్ధిదారులకు లాటరీ పద్ధతిలో అపార్ట్‌మెంట్లు కేటాయించారు.ఈలోగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాలుగేళ్ల పాటు వాటిని పట్టించుకోకుండా వదిలేశారు. ఇటీవల 441 మంది లబ్ధిదారులు రుణాలు పొందేందుకు అర్హత పొందగా, అందులో 350 మందికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి అపార్ట్‌మెంట్లు అప్పగించారు. కనీస వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారు.







మండపేటలో రంగులు మారాయి.. వసతుల్లేవ్

మండపేట, మే 7: నాలుగేళ్లకు ఇళ్లిచ్చారు.. అయితే వసతులను మాత్రం మరిచారు. మండపేటలో గత ప్రభుత్వ హయాంలో 4064 ఇళ్లను నిర్మించారు. ఫేజ్-1లో 3200 మందికి ఇళ్లను అందించగా వసతులు లేక 50 శాతం మంది కూడా మకాం రాలేదు. మరో 800 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు మంజూరు కాలేదు.ప్రభుత్వం మారిన తర్వాత రంగులంటే మారాయి తప్ప నేటికీ వరకు పేదలకు ఇళ్లను అందించి వసతులు కల్పించిన దాఖలాలు లేవు. ఫేజ్-2లో 20 68 గృహాలు పూర్తయినా నేటికా లబ్ధిదారులకు అందజేయలేదు. బ్యాంకుల నుంచి వాయిదాలు చెల్లించాలని నోటీసులివ్వడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

అల్లవరంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

అల్లవరం, మే 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రులోని టిడ్కో భవనాల్లో సమస్యలు తిష్టవేశాయి. ఇక్కడ రూ.113 కోట్లతో 2019 ఫిబ్రవరి 9న టిడ్కో భవనాలు ప్రారంభించారు. 1,632 కుటుంబాలు నివసించేలా భవనాలు నిర్మించినా 545 కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి. తాగునీటి సమస్య అధికంగా ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు పారట్లేదు. వర్షాకాలంలో వైనతేయ వరదనీరు పోటెత్తడంతో రోడ్లు మునుగు తున్నాయి. సి-6 భవనంలో స్లాబ్ లీకేజీ అవుతోంది. అసాంఘిక కార్యకలాపాలకు కొన్ని ప్లాట్లు అడ్డాగా మారాయి.

పెద్దాపురం, సామర్లకోటల్లో ఇళ్లెప్పుడిస్తారో..

సామర్లకోట/పెద్దాపురం, మే 7: పెద్దాపురం నియోజకవర్గం పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో 4,368 టిడ్కో గృహాలు గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. రెండు పట్టణాల్లోనూ లబ్ధిదారులు గత ప్రభుత్వ హయాంలోనే సామూహిక గృహప్రవేశాలు చేసుకున్నారు. ఈలోపు ఎన్నికలు రావడంతో లబ్ధిదారులకు స్వాధీనం చేయలేకపోయారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు అప్పగించకుండా తాత్సారం చేసింది. సామర్లకోటలో జగ్గమ్మగారిపేట లేఅవుట్‌లో 272 ఫ్లాట్‌లు, ఉప్పువారి సత్రం వద్ద 361 ఫ్లాట్‌లు నిర్మించారు. వీటిలో ఇప్పటివరకూ కేవలం 33 ఫ్లాట్‌లను మాత్రమే లబ్ధిదారులకు స్వాధీనపరిచారు. పెద్దాపురం పట్టణ శివారు వాలు తిమ్మాపురం వెళ్లే రహదారిలో మొదటి విడతలో 1728, రెండో విడతలో 1585 ఇళ్లు నిర్మాణాలు చేపట్టారు. మొదటి విడతలో నిర్మించిన ఇళ్లలో 1460 మందికి మాత్రమే పంపిణీ చేశారు. మిగిలినవాటిని ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. ఆయా గృహసముదాయాల్లో మౌలిక వసతులను పూర్తిగా విస్మరించారు. పైగా నిర్వహణ పూర్తిగా గాలికొదిలేశారు.



రామచంద్రపురంలో తుప్పల్లో వ్యాయామ పరికరాలు

రామచంద్రపురాన చెదలు

రామచంద్రపురం (ద్రాక్షారామ), మే 7: పేదలకు తక్కువ ఖర్చుతో గృహాలు అందించాలన్న ఉన్నతాశయానికి చెదలుపట్టింది. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన టిడ్కో గృహ నిర్మాణాలు పూర్తయినప్పటికీ తదుపరి మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు అందించకపోవడంతో ఇప్పటికీ పలు ఫ్లాట్లు లబ్ధిదారులకు అందలేదు. రామచంద్రపురంలో తొలివిడత నిర్మించిన 1098 ప్లాట్లలో చాలా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తలుపులు, గుమ్మాలు పూర్తిగా చెదలుపట్టి ఊడిపడిపోయాయి. బ్యాంకు రుణాలకు డాక్యుమెంటేషన్ పూర్తికాకపోవడం, వివిధ కారణాలతో ఫ్లాట్లు లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదు. దీంతో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న గృహాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. అయినా పట్టించుకునేవారే లేరు.



నిడదవోలులో ఐదేళ్లుగా ఇంతే!

నిడదవోలు, మే 7: గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పేదలందరికీ గృహాలు అందించాలనే లక్ష్యంతో నిడదవోలు పట్టణం తీరుగూడెం సమీపంలో 2017-18 సంవత్సరంలో 1152 మందికి టిడ్కో గృహాలు నిర్మించారు. నిర్మాణాలు పూర్తి కావొస్తున్న దశలో లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులు చేశారు. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే టిడ్కో గృహాల నిర్మాణాల పనులు నిలిచిపోయాయి. నేటికీ లబ్ధిదారులకు అందించకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. టిడ్కో గృహాల కోసం పేదలైన లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క అడుగూ ముందుకు పడలేదు.





సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్, హాజరైన శెట్టిబలిజ సామాజికవర్గ ప్రజలు

శెట్టిబలిజల అభివృద్ధికి, భవిష్యత్తుకు భరోసా

ఎన్నికల్లో శెట్టిబలిజ యువత సత్తా చాటాలి

రామచంద్రపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్

ద్రాక్షారామ, మే 7: శెట్టిబలిజల అభివృద్ధికి, భవిష్యత్తుకు, పిల్లల ఉద్యోగాలకు తాను భరోసా అని కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలోని సాయిమాధవానంద కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళనంలో సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురంలో శెట్టిబలిజలకు జరుగుతున్న అన్యాయాన్ని కళ్లారా చూశానన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో వాళ్లకు ఒరిగిందేమిటన్నారు. బీసీ కార్పొరేషన్‌లోను గానీ, హౌసింగ్‌లోను గానీ వచ్చిందా అని ప్రశ్నించారు. గతంలో బోస్ తీసుకువచ్చిన చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ విజయానికి సంఘాలు ఎంతో కష్టించి పనిచేసి గెలిపించారన్నారు. అయితే ఆయన ఏ పనీ చేయలేదన్నారు. కొంత మందిని కేసుల్లో ఇరికిస్తే ఏ కులసంఘమైనా కాపాడిందా... కనీసం ప్రశ్నించిందా అన్నారు. ఎంపీ బోస్ మూడుసార్లు పాలించారని, తదుపరి వేణును తీసుకువచ్చారని, ఇప్పుడు కుమారుడిని తీసుకువచ్చారన్నారు. ఆయన ఎంపీగా ఉన్నారు. ఆయనకు మారుడు ఎమ్మెల్యే కావాలి. అన్నీ వారి కుటుంబంలోనే ఉండాలా అన్నారు. యువకులు స్పష్టత కలిగి ఉన్నారన్నారు. రామచంద్రపురం నుంచి 20వేల మంది హైదరాబాద్ వలస వెళ్లడానికి కారణం ఏమిటన్నారు. రానున్నది కూటమి ప్రభుత్వమే అన్నారు. స్వార్థ రాజకీయ నాయకులకు బుద్ధి చెప్తానన్నారు. అమాయక ప్రజల కోసం పోరాడాను కాబట్టే తనపై కేసులు ఉన్నాయన్నారు. సమస్య వస్తే అధికారంలో ఉన్నా లేకున్నా మీ వెంట నేను ఉంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు టేకుమూడి సత్యనారాయణ, మేడిశెట్టి శేషారావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గుత్తుల బులిరాజు, గుబ్బల యేసురాజు, దంగేటి గౌరీశంకర్, విత్తనాల వెంకటరమణ, మాట్లాడారు. నియోజకవర్గంలో శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అభ్యర్థితో.. ఒకరోజు

ప్రచార వ్యూహంపై పార్టీ నాయకులతో చర్చిస్తున్న సుబ్బరాజు

12 గంటలు నిరంతర ప్రచారం



చెయ్యేరులో విజయ సంకేతం చూపుతూ సుబ్బరాజు ప్రచారం

రోజుకు 24 గంటలు కాదు.. 48 గంటలైనా సరిపోదేమో.. ఎన్నికల సమయం దగ్గరపడడంతో అభ్యర్థులు అంత బిజీబిజీగా ఉంటున్నారు. ఎన్నికల వేళ అసలు అభ్యర్థులేం చేస్తారు.. వారి షెడ్యూల్ ఎలా ఉంటుందనే దానిపై అందరికీ ఆసక్తే.. దీనిలో భాగంగా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు)తో ఆదివారం ఆంధ్రజ్యోతి అభ్యర్థితో ఒకరోజు నిర్వహించగా... ఉదయం నుంచి రాత్రి వరకు ఊపిరిసలపనంత బిజీబిజీగా గడిపారు... ఉదయం ఆరు గంటలకు నిద్ర లేచిన ఆయన కాసేపు వ్యాయామం చేశారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం చేసి ఇంట్లో దేవుని దర్శించుకున్న అనంతరం ప్రచారానికి బయల్దేరారు. ఉదయం 9 నుంచి రాత్రి 10 గంటలకు విస్తృత ప్రచారం చేశారు. గత రెండు నెలలుగా ఇదే షెడ్యూల్. - వివరాలు 7వ పేజీలో

అకాల వర్షం

ఈదురుగాలుల విధ్వంసం | కుప్పకూలిన చెట్లు | నేలవాలిన పంటలు

- 6లో

జన కేతనం

ఆంధ్రజ్యోతి

ఉమ్మడి
తూర్పుగోదావరి జిల్లా

బుధవారం 8 మే 2024 6

కుడి ఎడమైతే..



గెడ్డం మహాలక్ష్మి



నయినాల గణేశ్వరరావు

అమలాపురం రూరల్, మే 7: కుడి ఎడమైతే పొరపాటు లేదోయ్..అన్నాడో సినీ కవి. అది అక్షర సత్యం చేసిన నాయకులున్నారు. 1962లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం గ్రామానికి చెందిన గెడ్డం మహాలక్ష్మి రాజోలు ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి 30,460 ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పక్కనే ఉన్న నగరం నియోజకవర్గం నుంచి మామిడికుదురు గ్రామానికి చెందిన నయినాల గణేశ్వరరావు అదే పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే 1967లో జరిగిన సార్వత్రిక ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. దాంతో రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం జనరల్‌గాను, నగరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగాను మారిపోయాయి. దాంతో అప్పటి కాంగ్రెస్ అధిష్ఠానం ఈయన్ని అటు ఆయన్ను ఇటు పంపించి పోటీ చేయించారు. నగరం నుంచి గెడ్డం మహాలక్ష్మి, రాజోలు నుంచి నయినాల గణేశ్వరరావులు ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. అందుకేనేమో కుడి ఎడమైతే పొరపాటు లేదనేది.

నిఘా నేత్రం

- ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల వాహనాలకు సీసీ కెమెరాలు



కెమెరాతో కారు



పిఠాపురం/పెద్దాపురం, మే 7: నిఘాపై నిఘా నేత్రం. ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ప్రలోభాలు, నియమావళి ఉల్లంఘనలు సహా అన్నిరకాల అంశాలను పరిశీలించే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల పనితీరులో పారదర్శకత తీసుకువచ్చేందుకు వారి వినియోగించే వాహనాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిని బట్టి ప్రతి నియోజకవర్గంలో గెజిటెడ్ అధికారుల నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి ఎనిమిది గంటలకు ఒక స్క్వాడ్ విధులు నిర్వర్తించేలా నియోజకవర్గానికి తొమ్మిది నుంచి 15 స్క్వాడ్‌ల వరకూ ఏర్పాటు చేశారు. వీరికి అదనంగా జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులపై ముఖ్య ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్కడ ఎస్ఎస్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. వీరందరికి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాహన సౌకర్యం కల్పించారు. ప్రతి స్క్వాడ్‌లో గెజిటెడ్ అధికారితో పాటు ఒక కానిస్టేబుల్, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. వారు నిరంతరం వాహన తనిఖీలతో పాటు ఎన్నికల నియమావళి అమలు జరుగుతున్న తీరు, ఎన్నికల ప్రచార వాహనాల అనుమతులు, అభ్యర్థులు, పార్టీల తరపున ప్రచారాలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్‌షోలకు అనుమతులు ఉన్నాయా, ఉంటే వాటిని పాటిస్తున్నారా, నగదు, బంగారం, ఇతర వస్తువుల తరలింపులు తదితర అంశాలను పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వాటిపై చర్యలు తీసుకునే అధికారం ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు ఉంది. వీరు విధులు నిర్వర్తించే సమయంలో తప్పనిసరిగా వీడియోగ్రఫీ తీయాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్‌ల పనితీరుపై విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. తద్వారా వీరు జరిపే తనిఖీలకు సంబంధించిన అన్ని అంశాలను ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించడానికి వీలు ఏర్పడింది. ఏమైనా ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పుడు సీసీ ఫుటేజీల ఆధారంగా పరిశీలన జరపాలని ఎన్నికల కమిషన్ నుంచి మార్గదర్శకాలు వచ్చాయి. అదే విధంగా చెక్‌పోస్టుల వద్ద రహదారులకు అనుగుణంగా రెండు, మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు, అన్నిరకాల వాహన తనిఖీలు ఈ కెమెరాల్లో రికార్డవుతాయి. తద్వారా తనిఖీల్లో పారదర్శకత ఉంటుందని అధికారులు తెలిపారు.

పింఛన్ డబ్బులు అందించి ఆశీర్వదించి



పింఛన్ డబ్బు అందిస్తున్న దృశ్యం

పి.గన్నవరం, మే 7: ఎమ్మెల్యేగా గెలిచి కూటమి ప్రభుత్వం ఏర్పాటులో భాగస్వామ్యం కావడంతో పాటు తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరుతూ ఈనెల వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలను కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు దైవాల సత్యవతి అనే వృద్ధురాలు విరాళంగా అందించింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం కె.ముంజవరంలో మంగళవారం ఈ సంఘటన చోటు చేసుకుంది..

పవన్‌కు మద్దతుగా జబర్దస్త్ బృందం ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న రైజింగ్ రాజు

ఉప్పాడ (కొత్తపల్లి), మే 7: కూటమి పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా జబర్దస్త్ బృందం, సీరియల్ నటులు ఆధ్వర్యంలో మంగళవారం ప్రచారం జరిగింది. జబర్దస్త్ హాస్య నటుడు రైజింగ్ రాజు పవన్‌కల్యాణ్ ఎన్నికల గుర్తు గాజు గ్లాసుకు ఓట్లేసి ఘనవిజయం చేకూర్చాలని ఓటర్లను కోరారు. రాష్ట్ర భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని ఎన్‌డీఏ కూటమికి మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.

వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఉపాధి కూలీలు



చినజగ్గంపేటలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఉపాధి కూలీలు

గొల్లప్రోలు రూరల్, మే 7: కూలీలకు మస్తరు వేసేది ఉపాధి సిబ్బంది. వారు పాల్గొనేది మాత్రం వైసీపీ ఎన్నికల ప్రచారంలో. బహిరంగంగానే కూలీలందరిని ప్రచారానికి వెళ్లమని చెప్పడమే గాక దగ్గరుండి పంపించడంపై టీడీపీ, జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతావిశ్వనాథ్ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ఓపెన్‌టాప్ జీపుపై ఆమె ప్రచారం సాగిస్తుండగా నాయకులు, కార్యకర్తలు అనుసరించారు. ఈలోగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లోకి వచ్చిన ఉపాధి కూలీలకు అక్కడ సిబ్బంది మస్తరు వేశారు. వైసీపీ నేతల ఒత్తిడితో వారిని దగ్గరుండి ప్రచారానికి పంపడం విమర్శలకు తావిచ్చింది. బహిరంగంగానే వీరు ప్రచారానికి వెళుతుండటాన్ని గమనించిన టీడీపీ, జనసేన నేతలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడంతో గందరగోళం



కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), మే 7: కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద గందరగోళం నెలకొంది. దరఖాస్తు చేసినప్పటికీ తమ పేర్లు ఓటర్ల జాబితాలో ఎందుకు చేర్చలేదని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉద్యోగులు ఎన్నికల అధికారులను నిలదీశారు. కాకినాడ జిల్లా ఎన్నికల విధుల్లో ఉన్న కోనసీమ జిల్లా ఉద్యోగులకు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం ఇచ్చారు. దీంతో వారు కాకినాడ పీఆర్ కళాశాల కేంద్రానికి విచ్చేశారు. తీరా అక్కడికి వచ్చే సరికి కొంతమంది పేర్లు జాబితాలో కన్పించకపోవడంతో గందరగళం నెలకొంది. ఫారం-12 దరఖాస్తు చేసినా ఎందుకు జాబితాలో పేర్లను ఎందుకు చేర్చలేదని ఎన్నికల అధికారులను ప్రశ్నించారు. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద కొంత వాగ్వాదం నెలకొంది. గతంలో జరిగిన ఎన్నికల్లో ఇలాంటి దుస్థితి రాలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై ఉన్న కక్ష నేపథ్యంలో ఓట్లు చేర్చకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ జె.నివాస్ హుటాహుటిన పీఆర్ కళాశాలకు వచ్చారు. ఉద్యోగులతో చర్చించారు. ఎవరికైతే ఓటు లేదో వారికి బుధవారం ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

పవన్ రోడ్‌షో అనుమతులపై మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు

- దరఖాస్తులతో పడిగాపులు ● 10న కార్యక్రమంపై వీడని సస్పెన్స్

పిఠాపురం, మే 7: పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ నెల 10వ తేదీన నియోజకవర్గంలో నిర్వహించే రోడ్‌షో, సభలకు అనుమతుల విషయంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అదే రోజు సీఎం జగన్ పిఠాపురంలో పర్యటించనున్నారన్న సమాచారంతో ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పిఠాపురం నియోజకవర్గంలో ఈనెల 10వ తేదీన పవన్ రోడ్‌షోకు సంబంధించి ముందుగానే కార్యక్రమం ఖరారయింది. రోడ్‌షో రూట్‌మ్యాప్, రోడ్ కార్నర్ మీటింగ్‌లకు సంబంధించిన రూట్ మ్యాప్‌లతో టీడీపీ, జనసేన నాయకులు మంగళవారం ఉదయం 9.30 గంటలు-10 గంటల మధ్యలో ఆర్వో కార్యాలయానికి వెళ్లారు. అక్కడ అనుమతులకు సంబంధించిన దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రయత్నించగా సర్వర్ పనిచేయడం లేదంటూ సాయంత్రం వరకూ వెయిట్ చేయించారు. చివరకు సాయంత్రం 6.30 గంటల సమయంలో సర్వర్ పనిచేయడంతో పాటు ఓటీపీ నెంబర్ ఇచ్చారని ఆ పార్టీల నేతలు చెబుతున్నారు. అయితే ఈ విషయంలో టీడీపీ, జనసేన నేతల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అదే రోజు సీఎం జగన్ పిఠాపురంలో సభ నిర్వహిస్తారని విస్తృతంగా ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పవన్ పర్యటనకు అనుమతి ఇవ్వకుండా చేసేందుకు ఇలా చేశారా అనే అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సాయంత్రం 5గంటలకు పిఠాపురం ఆర్వో, జేసీ రామసుందరరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిపై ముందుగా ఎవరి లెటర్ వస్తే వారి దరఖాస్తునే పరిగణలోకి తీసుకుని అనుమతి ఇవ్వనున్నట్లు జేసీ తెలిపినట్లు వర్మ చెప్పారు. తమకు అనుమతులు వస్తాయని భావిస్తున్నామని తెలిపారు. అయినప్పటికి పవన్ పర్యటనకు అనుమతి విషయంలో అధికారులు ఎలా వ్యవహరిస్తారో అన్న సందేహం టీడీపీ, జనసేన నేతలను వెన్నాడుతున్నది.

అకాల వర్షం



మండపేట కపిలేశ్వరపురం రోడ్డులో నేలటూరు వద్ద ధాన్యపు రాశుల మధ్య నీటిని తోడుతున్న రైతు

అకాల వర్షం రైతులను ముప్పుతిప్పలు పెట్టింది. టార్పాలిన్లతో పొలాల్లోకి పరుగులు పెట్టించింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతులు పరుగు పరుగు వెళ్లి వాటిపై టార్పాలిన్లు కప్పుకునే పనిలో పడ్డారు.. కొన్ని చోట్ల చెట్లు నేలకూలాయి..ట్రాఫిక్ స్తంభించింది.

తడిసి ముద్దయ్యింది..

మండపేట, మే 7: మండపేట పరిసర ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల మండపేట పట్టణం, మండలంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. మండపేట గొల్లపుంత కాలనీలో, కేపీ రోడ్డులో, స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రైతులు ఆరబోసుకున్న ధాన్యం వర్షానికి తడిసిముద్దయింది. రాశులపై కప్పిన బరకాలు గాలులకు ఎగిరిపోయాయి. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా తడిసి ముద్దయిన ధాన్యం కళ్లాల్లో కనిపించింది.

నేలకొరిగిన అరటి



ఆత్రేయపురం మండలం కట్టుంగలో నేలకొరిగిన అరటి పంట

ఆత్రేయపురం, మే 7: వాయుగుండం ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మంగళవారం మధ్యాహ్నం ఈదురుగాలులు వీయడంతో అమలాపురం-బొబ్బర్లంక రహదారిపై భారీ వృక్షాలు నేలకొరిగి రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రయాణికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తడిసిముద్దయి ట్రాఫిక్‌ను నియంత్రించుకున్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం రాశులను రైతులు ఒబ్బిడి చేసుకుని బరకాలు కప్పుకున్నారు. కట్టుంగ, అంకంపాలెం, ర్యాలి, ఉచ్చిలి తదితర ప్రాంతాల్లో చేతికి వచ్చిన అరటి పంట నేలకొరిగింది. తాడిపూడి, కట్టుంగతో పాటు వివిధ గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు నేలకొరిగాయి.

ధాన్యం రక్షించుకునే పనిలో..

అంబాజీపేట మండలం కె.పెదపూడిలో ధాన్యానికి బరకాలు కప్పుతున్న రైతులు



అంబాజీపేట, మే 7: అకాల వర్షంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేతికి వచ్చిన పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. ఒక్కసారిగా వర్షం రావడంతో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని బరకాలతో కప్పుకోవడంతో పాటు ఆరబోసినన ధాన్యాన్ని మిల్లర్లకు పంపించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో 45శాతం వరి కోతలు పూర్తికాగా రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్నారు.

ఈదురుగాలుల విధ్వంసం



ఈతకోట-గంటి రోడ్డులో ఈదురు గాలులకు బోల్తాకొట్టిన ధాన్యం లోడు ట్రాక్టర్



ధాన్యం రాశులపై బరకాలు

రావులపాలెం, మే 7: రావులపాలెం మండలంలో కురిసిన అకాల వర్షంతో కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం రాశుల చుట్టూ వర్షం నీరు చేరింది. ఈదురుగాలులకు కొబ్బరి చెట్లు, తాడి చెట్లు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈతకోట, గంటి, రాజవరం, పొదలాడ రోడ్డులో భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డుగా పడిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈదురుగాలులకు ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడింది. రావులపాలెం మార్కెట్ రోడ్డు పూర్తిగా జలమయమైంది. ఆర్టీసీ కాంప్లెక్స్ తహసీల్దారు కార్యాలయం రోడ్డు, పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి.



కె.గంగవరం: పామర్రు ఉన్నత పాఠశాల ఆటస్థలంలో వాననీటిలో ధాన్యం రాశులు

రైతుల ఇబ్బందులు

కె.గంగవరం, మే 7: కె.గంగవరం మండలంలో మంగళవారం కురిసిన అకాల వర్షానికి వరి రైతులు ఇబ్బందులు పడ్డారు. రబీ పంట మాసూళ్లు ముమ్మరంగా జరగుతుండటంతో యంత్రాలతో కోసిన పంటను రైతులు రోడ్లపై, దిమ్మలపై ఎండబోసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఒబ్బిడి చేయలేకపోయారు. వాన నీటిలో పంట తడిసిపోయింది. పామర్రు ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ధాన్యం ఆరబెట్టి తర్వాత రాశులుగా ఏర్పాటు చేశారు. వర్షం కురవడంతో రాశులు ముంపు బారిన పడ్డాయి. భారీ వర్షంతో వరి పొలాల్లో నీరు నిలిచిపోయింది. ఇంకా కోతలు పూర్తికాని పొలాల్లో మరో వారం రోజులు కోతలు కోసే వీల్లేదు. వర్షానికి తడిసిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



అవిడిలో తడిసిన ధాన్యం

ముద్దయ్యాయి..



ధాన్యం రాశులను కాపాడుకునే పనిలో రైతులు

సామర్లకోట, మే 7: సామర్లకోట పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ధాన్యంలో తేమశాతం పోయేందుకు ఎండలో ఆరబెట్టిన ధాన్యం రాశులు అకాల వర్షానికి తడిసి ముద్దయ్యాయి. అన్నదాతలు కుదేలయ్యారు. సామర్లకోట మండలంలో దాళ్వా వరిపంట కోతలు సుమారు 90 శాతం పూర్తికాగా ధాన్యాన్ని ప్రభుత్వం సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆరుబయట మైదానాలలో ఆరబెడుతూనే ఉన్నారు. అదే క్రమంలో మంగళవారం సామర్లకోట చెరకు యార్డు కళ్లాలలోనూ, మాండవ్య నారాయణ స్వామి ఆలయం ఎదురుగా మైదానంలోనూ, భీమేశ్వరాలయం రోడ్డుకు ఇరువైపులా, ఏడీబీ రోడ్డు జ్యూయల్ మెడిస్ మైదాన ప్రాంతాల వద్ద ధాన్యాన్ని రైతులు ఆరబోసారు. అయితే వాతావరణం ఒక్కసారిగా మారిపోయి అకాల వర్షం కురుస్తుందని ఊహించలేని రైతులు కళ్లాలలో తడిసిన ధాన్యాన్ని చూసి తీవ్ర ఆవేదన చెందారు.

అన్నదాతల ఆందోళన



అవిడిలో కల్లాల్లోనే ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకుంటున్న రైతులు

కొత్తపేట, ఏప్రిల్ 7: మండలంలో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవ్వడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ తీగలు తెగిపోయాయి. కొబ్బరిచెట్లు పడడంతో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. వాణిజ్య పంటలైన అరటి, మొక్కజొన్న, బొప్పాయి నేలకొరగగా మామిడితోటలు ధ్వంసమయ్యాయి.

రాజమహేంద్రవరంలో భారీ వర్షం

రాజమహేంద్రవరంలో వర్షం





రాజానగరంలో..

రాజమహేంద్రవరం సిటీ, మే 7 : రాజమహేంద్రవరాన్ని భారీ వర్షం నీట ముంచేసింది. మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు రాజమహేంద్రవరంలో వర్షం ప్రారంభమై సుమారు 2గంటల పాటు కురిసింది. దీంతో నగరంలో డ్రైనేజీలు పొంగిపొర్లాయి. నగరంలో రోడ్లన్నీ నీట మునిగాయి. రెండు గంటల పాటు కురిసిన వర్షానికి కృష్ణానగరంలో కారు నీటిలో తేలి కొంతదూరం కొట్టుకుపోయింది. బైక్‌లు, స్కూటీలు నీట మునిగాయి. చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సుమారు 3 గంటల పాటు జనజీవనం స్తంభించింది. సుమారు 6 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

జన కేతనం

ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం టౌన్, మే 7: కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఉభయ గోదావరి జిల్లాల కన్వీనర్ ఎం.వే ణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి జూన్ 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ ఏర్పాటు చేశామన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులంతా సమీపంలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఏర్పాటుచేసిన వెరిఫికేషన్ కేంద్రాల వద్ద అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ నమోదు పత్రాలతో హాజరై జూన్ 10న వెరిఫికేషన్ చేయించుకుని అప్రూవల్ పొందాలన్నారు. అలా చేయించుకోనివారు కౌన్సెలింగ్‌కు అనర్హులవుతారన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు సందేహాలుంటే మొబైల్: 9494688516, ల్యాండ్ ఫోన్: 0884-2348182 సంప్రదించాలన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఈ నెల 10 నుంచి జూన్ 10వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు సమయంగా నిర్ధారించారు.

రైతుల భూమి తాకట్టులో ఉన్నట్టే..

పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

ఉప్పలగుప్తం, మే 7: జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో రైతుల భూమి తాకట్టులో ఉన్నట్టేనని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వ్యాఖ్యానించారు. రైతులు అప్రమత్తమై ఎన్నికల్లో వైసీపీని ఓడించడం ద్వారా తమ ఆస్తులకు రక్షణ కల్పించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలో అరిగెల నరసింహారావు స్వగృహం వద్ద మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో చినరాజప్ప మాట్లాడారు. అసలు చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వం చేసిన మార్పులతో చట్టానికి అర్థం లేకుండా పోయిందన్నారు. పాస్ పుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకోవడం వెనుక మర్మమేమిటో రైతులు గమనించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలు కాకుండా చూస్తామన్నారు. అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ రైతుల ప్రాథమిక హక్కును హరించేలా చట్టాన్ని తమ స్వప్రయోజనాల కోసం జగన్ ప్రభుత్వం రూపొందించిన తీరు దారుణమన్నారు. జనసేన నాయకుడు ఇసుకట్ల రఘుబాబు మాట్లాడుతూ రైతులంతా ఈ చట్టాన్ని వ్యతిరేకించకపోతే భూయాజమాన్య హక్కును కోల్పోవడం ఖాయమన్నారు. సమావేశంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, బీసీ నాయకుడు లంకే భీమరాజు, ఎస్సీ నాయకులు పెయ్యల దుర్గారావు, బూసి బుజ్జిదొర, జనసేన నాయకులు అయితాబత్తుల ఉమా, చిక్కం సూర్యమోహన్, మంచెం బాలకృష్ణ, గనిశెట్టి కిశోర్ పాల్గొన్నారు.



అన్నవరం ఘాట్‌రోడ్‌పై మరమ్మతులు

అన్నవరం, మే 7: సత్యదేవుడి సన్నిధికి వెళ్లే ఎగువ ఘాట్‌రోడ్‌పై మంగళవారం నుంచి గురువారం వరకు వాహనాలకు అనుమతిని తాత్కాలికంగా నిలుపుదల చేయనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. 2002లో నిర్మించిన ఈ ఘాట్‌రోడ్డు మరమ్మతులకు గురై రోడ్డుపై గుంతలు పడడంతో సుమారు రూ.40 లక్షలతో పూర్తిస్థాయిలో ఒక లేయర్ తారురోడ్డుగా పనులు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. గురువారం నుంచి వాహనాలు యథావిధిగా కొండపైకి చేరుకోవచ్చునని అంతవరకు ఇబ్బందులు తలెత్తకుండా దిగువ ఘాట్‌రోడ్డు నుంచి వాహనాలు రాకపోకలకు అనుమతించారు.

అన్నవరంలో ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

అన్నవరం, మే 7: విశాఖపట్నానికి చెందిన ప్రేమజంట మంగళవారం గ్రామశివారున ఉన్న ప్రైవేటు లాడ్జిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. విశాఖపట్నంలో వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎస్.హర్షవర్ధన్ (25), ఆన్‌లైన్ ప్రోడక్ట్స్ విక్రయిస్తున్న యువతి (24)గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే హర్షవర్ధన్‌కు ఇదివరకే వివాహం కావడంతో పెద్దలు అంగీకరించరనే కారణంతో సోమవారం రాత్రి లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. బుధవారం ఉదయం పురుగులుమందు తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడడంతో లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారమిచ్చారు. చికిత్స పొందుతూ వారు కోలుకుంటున్నట్లు అన్నవరం పోలీసులు తెలిపారు.

లోవలో ఘనంగా జాతర





సాంస్కృతిక కార్యక్రమాలు

తుని రూరల్, మే7: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. లోవకొత్తూరు గ్రామంలో అమ్మవారి అనుబంధ దేవాలయం ప్రాంగణంలో జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి తరలించారు. ఈ వేడుకను పురస్కరించుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు తీసుకుని భక్తులకు తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

జగన్ సభ వద్ద విషాదం

సమీపంలోని స్లాబ్ కూలి వ్యక్తి మృతి..ఒకరికి గాయాలు



ప్రమాదం జరిగిన ప్రాంతంలో కూలిన స్లాబ్

సీతానగరం, మే 7: జగన్ ప్రచార సభ సీతానగరం మండలం, సింగవరం గ్రామంలో విషాదఛాయలు నింపింది. జగన్ సభకు సమీపంలోని జంబూపట్నం జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వేసిన స్లాబ్ కూలి సింగవరం గ్రామానికి చెందిన మోర్తా శ్యాంకుమార్(22) మృతిచెందగా అదే గ్రామానికి చెందిన ముంగనూరి పృథ్వీరాజ్ తీవ్ర గాయలపాలై అపస్మారక స్థితిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం కోరుకొండ గ్రామంలో జగన్ సిద్ధం సభ జరిగింది. ఈ సభకు సీతానగరం మండలం సింగవరం గ్రామం నుంచి పలువురు వెళ్లారు. సభా ప్రాంగణం సమీపంలోని జంబూపట్నం జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉండగా స్లాబ్ కూలిపోవడంతో సింగవరం గ్రామానికి చెందిన మోర్త శ్యాం కుమార్ మృతిచెందగా పృథ్వీరాజ్ తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మోర్తా శ్యాంకుమార్ రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగా పృథ్వీరాజ్ కాకినాడలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శ్యాంకుమార్ మృతి చెందడంతో సీతానగరం మండలం సింగవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి



108 రకాల స్వీట్లతో సారె

పిఠాపురం, మే 7: పిఠాపురం పట్టణంలో కొలువై ఉన్న గొల్లమారెమ్మతల్లికి మహిళలు సారె సమర్పించారు. మిరపకాయల వీధికి చెందిన మహిళలు 108 రకాల స్వీట్లు, పండ్లు, పసుపు, కుంకుమ, వివిధ రకాల పిండివంటలను తీసుకుని ప్రదర్శనగా ఆలయానికి తీసుకువచ్చారు.

మర్రిపాక గ్రామంలో స్టిక్కర్ వివాదం

జగ్గంపేట, మే 7: కాకినాడ జిల్లా మర్రిపాక గ్రామంలో మంగళవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఎం జగన్ స్టిక్కర్‌ను అతికించడంతో వివాదం రేగింది. వైసీపీ నేతలు స్టిక్కర్ అతికించడంతో టీడీపీ నేతలు జెండాలు కట్టారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కొన్ని ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించడంతో గ్రామంలో వాతావరణం వేడెక్కింది. విషయం తెలుసుకున్న ఎన్నికల సిబ్బంది వాటిని తొలగించారు. దీంతో అధికారులతో వైసీపీ నేతలు వాగ్వివాదానికి దిగారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకలు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. స్టిక్కర్లు అతికించడాన్ని ఒప్పుకునేదిలేదని టీడీపీ నేతలు నినదించారు. ఆర్వో వెంటనే మర్రిపాక చేరుకున్నారు. స్టిక్కర్లు అతికించడానికి ఉన్న అనుమతి లేఖలను చూపించాలని అడిగారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో అతికిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని సీఐ లక్ష్మణరావు తెలిపారు.

అభ్యర్థితో.. ఒకరోజు



కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం..



కాఫీ తాగుతూ... ఆంధ్రజ్యోతి చదువుతూ

విధ్వంస పాలన నుంచి రక్షించేందుకు

ఈ ఎన్నికలు కీలకం

కూటమి అధికారంలోకి రావడం ఖాయం

ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారం

ప్రజలతో మమేకమవుతూ ప్రచారంలో దూసుకుపోతూ...

ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజుతో ఒక రోజు

రాష్ట్రంలో ఐదేళ్లపాటు సాగిన విధ్వంసక, అరాచక పాలన నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు ఈ ఎన్నికలు అత్యంత కీలకమని ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) పేర్కొన్నారు. మంగళవారం ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఒకరోజు ప్రయాణం సాగించింది. ఎన్నికల ప్రచారంలో నిరంతరం బిజీగా ఉన్న సమయంలో ఆయన దినచర్య ఏమిటి అనే దానిపై పరిశీలన చేసింది. రోజుకు కేవలం ఐదు గంటలు మాత్రమే నిద్రిస్తూ మిగతా సమయమంతా ఎన్నికల ప్రచారానికి కేటాయిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్లను కలుసుకోవడం... ప్రచారం... వివిధ సామాజికవర్గాలకు చెందిన నాయకులు, ప్రముఖులను కలవడం.. ప్రత్యర్థి బలాబలాలను అంచనా వేయడంతో పాటు వ్యూహ ప్రతివ్యూహాలను రచిస్తూ బిజీగా గడపడం 'ఆంధ్రజ్యోతి' గుర్తించింది.

● **ముమ్మిడివరం, ఐ.పోలవరం**



చెయ్యేరులో సూదా బాబూరావు నివాసంలో భోజనం చేస్తూ...

బిజీ షెడ్యూల్

ఉదయం 6 గంటలకు నిద్రలేచిన సుబ్బరాజు అరగంట సేపు ఇంటి ఆవరణలోనే వ్యాయామం చేశారు. బ్రష్ చేసిన అనంతరం 6.45 గంటలకు కాఫీ తాగుతూ 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక చదివారు. 7.15 గంటలకు తండ్రి ఇంద్రరాజు, తల్లి నారాయణమ్మ, భార్య పార్వతి, కుమార్తెలు స్నేహిత, శ్రావ్య, సోదరి చిలువూరి శ్రీదేవిలతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం మురమళ్లలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమై ప్రచార వ్యూహంపై చర్చించారు. 8.25 గంటలకు బయలుదేరి ముమ్మిడివరం మండలం రాణేలంకలో టీడీపీ నాయకుడు పాత్రుని బుజ్జి గెస్ట్‌హౌస్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. 9.10 గంటలకు కాట్రేనికోన మండలం చెయ్యేరు ప్రచారానికి బయల్దేరారు.

చెయ్యేరులో భోజనం... రాత్రి పదింటిదాకా ప్రచారం

ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రచారంలో నిమగ్నమయ్యారు. కూటమి మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి విధ్వంసక పాలన, అక్రమాలు, అవినీతిని వివరిస్తున్నారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా గంటి హరీష్‌మాదుర్‌కు సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. చెయ్యేరులో కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్న అనంతరం కూటమి నాయకులతో కలిసి పాదయాత్రగాను, మోటారుసైకిల్‌పై, ప్రచార రథంపై ప్రచారం సాగించారు. బొమ్మరాళ్లతిప్ప, పందువారిపేట, కొత్త కాలనీ, నేతాజీ నగర్, చెయ్యేరు, కొమ్మాయిచెరువు, రాయుడువారిపాలెం, వడ్డిపేట, జల్లగుంట, అగ్రహారం, చింతలమెరక, బాపనచెరువుల్లో ప్రచారం చేశారు. సాయంత్రం 4.20 గంటలకు చెయ్యేరులో సూదా బాబూరావు ఇంటికి చేరుకుని భోజనం చేశారు. ఎన్నికల సమయం దగ్గరపడడంతో అక్కడ కాసేపు ముఖ్య నాయకులతో అంతరంగిక సమావేశం నిర్వహించారు. సాయంత్రం ఐదు నుంచి రాత్రి పది గంటల వరకు ప్రచారం కొనసాగించారు. ఇంటికి చేరుకుని మరుసటి రోజు ప్రచారం ఎలా చెయ్యాలనే దానిపై పార్టీ నాయకులతో చర్చించి రాత్రి ఒంటి గంట వరకు బిజీగా గడిపారు. ప్రచారంలో ఆయన వెంట అల్లుళ్లు ఉప్పలపాటి రుషివర్మ, కనుమూరి సూర్య వున్నారు.

ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే లక్ష్యం





ప్రచార రథంపై బుచ్చిబాబు (పైన) మామకు మద్దతుగా అల్లుళ్లు రుషివర్మ, సూర్య ప్రచారం

రాష్ట్రంలోను, నియోజకవర్గంలోను ప్రజలకు సుపరిపాలన అందించి భావితరాల ఉజ్వల భవిష్యత్తుకు మంచి చేయాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తున్నాం. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలి. ఎన్నికల్లో గెలవడానికి నిరంతరం శ్రమిస్తాం. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మా విజయానికి విశేష కృషి చేస్తున్నారు. కూటమి అధికారంలోకి రావడం ఖాయం. ముమ్మిడివరం నియోజకవర్గాన్ని గతంలో రూ.1,800 కోట్లతో అభివృద్ధి చేశాం. ఆ తర్వాత జరిగిన అభివృద్ధి శూన్యం. ముఖ్యంగా మంచినీటి సమస్యను పరిష్కరించి, నదీకోత నివారణకు రక్షణ చర్యలు చేపడతాం. రహదారులన్నిటినీ ఆధునికీకరిస్తాం. జి.మూలపొలం-పల్లంకుర్రు, గుత్తెనదీవి-గోగుల్లంక వారధుల నిర్మాణం పూర్తి చేస్తాం. మహిళలకు రక్షణ చట్టం, నిరుద్యోగులకు ఉపాధి, ఎస్సీ, బీసీ సబ్‌ప్లాన్, కార్పొరేషన్ల ఏర్పాటు, బీసీ రక్షణ చట్టం వంటివి ప్రజలకు అందేలా కృషి చేస్తాం. సాగునీటి, మురుగునీటి కాల్వలను ఆధునికీకరించి రైతుల సమస్యలను పరిష్కరిస్తాం. కూటమిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుంది.

మూడో రోజు 80.30 శాతం

- **పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు**
- **అత్యధికంగా రాజోలులో 95.84 శాతం**
- **అత్యల్పంగా కొత్తపేటలో 69.82 శాతం పోలింగ్**

అమలాపురం టౌన్, మే 7: సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉన్న వివిధ శాఖల ఉద్యోగులు, ఇతర జిల్లాల ఉద్యోగులు మూడో రోజు మంగళవారం జిల్లాలోని ఏడు ఫెసిలిటేషన్‌కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. 14,921 మందికి 11,981 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోగా 80.30 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా రాజోలులో 95.84 శాతం, అత్యల్పంగా కొత్తపేటలో 69.82 శాతం మంది ఓటేశారు. రామచంద్రపురంలో 2,244 మందికి 1582 మంది (70.50 శాతం), ముమ్మిడివరంలో 2,035 మందికి 1,527 మంది (75.04 శాతం), అమలాపురంలో 2,398 మందికి 2,135 మంది (89.03 శాతం), రాజోలులో 2,163 మందికి 2,073 మంది (95.84 శాతం), పి.గన్నవరంలో 2,043 మందికి 1,821 మంది (89.13 శాతం), కొత్తపేటలో 2,253 మందికి 1,573 మంది (69.82)శాతం, మండపేటలో 1,785 మందికి 1,270 మంది (71.15 శాతం) పోలింగ్ నమోదైంది. అమలాపురంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలను కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు. కాకినాడ జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగులు పి.గన్నవరంలో విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి పోస్టల్ బ్యాలెట్ లేకపోవడంతో కలెక్టర్ శుక్లా దృష్టికి తీసుకువచ్చారు.



అమలాపురంలో ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం బారులు తీరిన ఉద్యోగులు

వృద్ధులు, దివ్యాంగులకు హోం ఓటింగ్

- **జిల్లాలో తొలిరోజు 58.55 శాతం హోం ఓటింగ్**
- **రామచంద్రపురంలో అత్యధికం, రాజోలు నిల్**
- **అమలాపురంలో పరిశీలించిన కలెక్టర్ శుక్లా**



అమలాపురం వడ్డిగూడెంలో కలెక్టర్ శుక్లా సమక్షంలో ఇంట్లోనే ఓటు వేస్తున్న వృద్ధుడు



అమలాపురంలో హోం ఓటింగ్ వేస్తున్న వృద్ధురాలు

అమలాపురం టౌన్, మే 7: పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే ప్రక్రియకు ఎన్నికల సంఘం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియను మంగళవారం ఆయన ప్రారంభించారు. అమలాపురం పట్టణ పరిధిలోని వడ్డిగూడెంలో ఇంటి నుంచే ఓటింగ్ వేసే విధానాన్ని కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 109 మంది హోం ఓటింగ్‌కు అర్హులని తెలిపారు. ఓటింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు తరలిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు ఎస్. మనోహర్, ఓటింగ్ బృంద సభ్యులు నాగిరెడ్డి శివప్రసాద్, సరిదే సత్యపల్లంరాజు, ఎన్వీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి ప్రవేశపెట్టిన హోం ఓటింగ్‌లో భాగంగా తొలిరోజు జిల్లాలో 58.55 శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా రామచంద్రపురంలో 98.39 శాతం నమోదు కాగా రాజోలులో ఓటింగ్ జరగలేదు. ఆ నియోజకవర్గంలో హోం ఓటింగ్ బుధవారం నుంచి నిర్వహిస్తారు. ముమ్మిడివరంలో 171 మందికి 82 మంది (47.95 శాతం), రామచంద్రపురంలో 62 మందికి 61 మంది (98.39 శాతం), అమలాపురంలో 109 మందికి 106 మంది (97.25 శాతం), పి.గన్నవరంలో 421 మందికి 172 మంది (40.86 శాతం), కొత్తపేటలో 63 మందికి 57 మంది (90.48 శాతం), మండపేటలో 260 మందికి 251 మంది (96.54 శాతం) ఓటింగ్ నమోదైంది.



రాయవరం మండలం వెదురుపాకలో తన నివాసంలో ఓటేస్తున్న విజయదుర్గా పీఠాధిపతి గాడ్



బండారులంకలో హోం ఓటింగ్‌లో పాల్గొన్న దివ్యాంగుడు

ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనేలా కృషి చేయాలి: డీఆర్వో వెంకటేశ్వర్లు



అమలాపురం టౌన్, మే 7: ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనేలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు సూచించారు. సార్వత్రిక ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ విధానాలను వివరించారు. జిల్లాకు సంబంధించి అదనంగా ఉన్న ఈవీఎంలను ఇతర జిల్లాల్లో అభ్యర్థులు ఎక్కువ మంది పోటీలో ఉన్న చోటకు తరలిస్తున్నామన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మ, రాజకీయ పార్టీల నాయకులు దూరి రాజేష్, వడ్డి నాగేశ్వరరావు, కాశి లక్ష్మీభవానీ తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల పరిశీలన

అమలాపురం టౌన్, మే 7: జిల్లాలో షాడో, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను పోలీసు ఎన్నికల పరిశీలకుడు ఎంపీ చంద్రకాంత్ మంగళవారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కాట్రేనికోన మండలం మగసానితిప్ప, బలుసుతిప్ప, నీలరేవు, మొల్లేటిమొగ, కొత్తపాలెం, ఐ.పోలవరం మండలం గోగుల్లంక గ్రామాల్లోని షాడో పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. మలికిపురం రామరాజులంకలోని క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. రూ.10 లక్షలు దాటి నగదు రవాణా అయితే ఆ నగదును సీజ్ చేసి ఆదాయపు పన్ను శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హింసకు తావులేని ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసు ఎన్నికల పరిశీలకుడు మొబైల్ 7893256556కు సమాచారం అందించాలని కోరారు.



మలికిపురం మండలం రామరాజులంకలో క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న చంద్రకాంత్

సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్

యానాం, మే 7: యానాం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్రికెట్ కోచింగ్ శిబిరం ఏర్పాటు చేసినట్టు అసోసియేషన్ ప్రతినిధి పంతగడ సుమన్ తెలిపారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో ఏడు నుంచి 16ఏళ్ల బాలబాలికలకు శిక్షణ ఇస్తారు. శిబిరాన్ని వ్యాయామ ఉపాధ్యాయులు పాలిక శివప్రకాష్, జె.చంద్రశేఖర్, చింత వెంకన్న, ఎం.భానుకిరణ్, వరప్రసాద్ ప్రారంభించారు. 72 మంది విద్యార్థులు హాజరయ్యారు.

- పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
- జనసేన-బీజేపీ-టీడీపీ కార్యకర్తల సమావేశం
- అమలాపురం అసెంబ్లీలో టీడీపీ ఎంతో పటిష్టం

భారతీయ కిసాన్ సంఘ్ వినతి

కాట్రేనికోన, మే7: భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబుకు డిమాండ్లతో కూడిన వినతిప త్రాన్ని సమర్పించారు. రైతులకు రూ.5లక్షల వరకు వడ్డీలేని రుణం, మేలైన వరివంగడాల సరఫరా, స్వేచ్ఛా వాణిజ్య వెసులుబాటు, 10గంటల పాటు ఉచిత విద్యుత్,ఎన్ఆర్జీఎస్ చట్టసవరణ, ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు తదితర డిమాండ్లను ఆయన ముందుంచారు. వెంకటానంద, ముత్యాల జమ్మేలు, తిక్కిరెడ్డి గోపాలకృష్ణ, జీఆర్కే బాలకృష్ణ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలు వింటున్న వేగుళ్ల, బీజేపీ నేత కోన సత్యనారాయణ

మండపేట, మే7: మంగళవారం కురిసిన భారీ వర్షానికి తడిసి, ముద్దయిన ధాన్యాన్ని ప్రభుత్వం నిబంధనలు సడలించి తక్షణమే కొనుగోలు చేయాలని కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండపేట-కపిలేశ్వరపురం రోడ్డులో వున్న నేలటూరుకు చెందిన రైతుల ధాన్యం మంగళవారం కురిసిన భారీ వర్షానికి తడిసి ముద్దయింది. స్థానిక కూటమి నేతలతో కలిసి వేగుళ్ల తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. జరిగిన నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్దనుంచి తడిసిన ధాన్యం ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిబంధనలు తొలగించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నియోజకవర్గ బీజేపీ నాయకుడు కోన సత్యనారాయణ, పాలచర్ల శిరీషా, హరిబాబు తదితరులు ఉన్నారు.

భారీ వర్షం - కుప్పకూలిన చెట్లు



ఆలమూరు: పెదపళ్ల వద్ద తడిసిన ధాన్యం రాశులు

ఆలమూరు, మే 7: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు మంగళవారం కురిసిన భారీ వర్షం ఉపశమనం కల్పించినప్పటికీ భారీ నష్టం కలిగించింది. ఆలమూరు యానాదులపేట వద్ద కొబ్బరి చెట్టు విద్యుత్ లైన్‌పై పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెదురుమూడి రోడ్డులో పలుచోట్ల చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. దాళ్వా వరి ధాన్యం తడిసిపోయింది. అకాల వర్షానికి ఇటుక పరిశ్రమకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని బట్టీ వ్యాపారులు చెప్పారు. విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు ఆ శాఖ సిబ్బంది కృషి చేస్తున్నారు.

వర్షానికి తడిసిన దాళ్వా పంట

అల్లవరం, మే 7: అకాల వర్షానికి మండలంలోని పలు చోట్ల ధాన్యం రాశులు, వరి పనలు తడిసి ముద్దయ్యాయి. చేతికందివచ్చే పంట కళ్లెదుటే తడిసిపోవడంతో రైతులు గగ్గోలుపెట్టారు. దేవగుప్తం, యెంట్రుకోన, అల్లవరం తదితర ప్రాంతాల్లో వరి పనలు తడిసాయి. కొందరు రైతులు ధాన్యం రాశులపై బరకాలు కప్పి కాపాడుకున్నారు.

అన్నదాత కుదేలు

పి.గన్నవరం, మే 7: మంగళవారం కురిసిన వర్షానికి అన్నదాత గుండెల్లో గుబులు మొదలైంది. కొన్ని రోజులుగా వరి మాసుళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులు, తేలికపాటి జల్లులు రైతులను కంగారు పెట్టించాయి. దీంతో రైతులు ధాన్యం రాశులపై బరకాలు కప్పుకుని కాపాడుకునే ప్రయత్నం చేశారు. పట్టుపడిపట్టిన ధాన్యాన్ని బరకాలతో కప్పుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో కోతలు దాదాపుగా పూర్తికావచ్చాయి. మరి కొన్ని ప్రాంతాల్లో కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

పి.గన్నవరం, మే 7: ఐదేళ్ల నుంచి అరాచక పాలనలో నలిగిపోతున్న ప్రజానీకానికి విముక్తి కలిగించాలని దక్షిణ భారత జేఏసీ కన్వీనర్ దాసరి రాము పిలుపునిచ్చారు. స్థానిక జనసేన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేనాని పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు అన్ని కులాలు అండగా ఉండాలన్నారు. రాష్ట్రంలో 200 నుంచి 300 కులాలు వరకు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నాయన్నారు. వారికి రాజ్యాధికారం కల్పించడానికే పవన్ కల్యాణ్ జనసేన పార్టీని స్థాపించారన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించి అరాచక పాలనకు చెక్ పెట్టాలని ఆయన కోరారు. సమావేశంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, నల్లా పవన్, నల్లా అజయ్, సంజయ్, యల్లమిల్లి చిట్టిబాబు, ఆదిమూలం సూరయ్యకాపు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, దొమ్మేటి సాయికృష్ణ, పప్పుల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ సస్పెన్షన్

రాయవరం, మే 7: వెంటూరులో ఈనెల5న వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్ మోర్త వరప్రసాద్ పాల్గొన్నాడు. దీనిపై కొందరు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల అధికారుల ఆదేశాలతో స్థానిక అధికారులు సంఘటనపై విచారణ జరిపి నివేదను ఆర్డీవోకు అందజేశారు. ఈనేపథ్యంలో ఎండీయూ ఆపరేటర్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ ఆర్డీవో సుధాసాగర్ ఉత్తర్వులు ఇచ్చినట్లు తహశీల్దారు ఆర్వీ కృష్ణారావు తెలిపారు.

తేనెటీగల దాడిలో కూలీలకు అస్వస్థత

అంతర్వేది, మే 7: సఖినేటిపల్లి మండలం రామేశ్వరం గ్రామంలో మంగళవారం ఉపాధి పనిచేస్తోన్న కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈదాడిలో ఇరవై మందికిపైగా కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వారిని స్థానికులు రామేశ్వరం పీహెచ్‌సీకి తరలించారు. వైద్యాధికారులు సూరజ్, యూనస్ వైద్య సేవలందించారు. ఒకరి పరిస్థితి తీవ్రంగా ఉండడంతో రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్వీయ రక్షణకు వైసీపీని ఓడించేందుకు జనం సిద్ధం



గొల్లవిల్లిలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

ఉప్పలగుప్తం, మే 7: రాష్ట్రంలో ప్రజలంతా స్వీయ రక్షణకోసం జగన్‌ను గద్దె దింపేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. గొల్లవిల్లిలో మంగళవారం టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన జరిగిన జనసేన-బీజేపీ-టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని నియోజకవర్గాల్లో స్థానికేతరులను దింపి అల్లర్లు సృష్టించేందుకు వైసీపీ వ్యూహరచన చేసిందని, ఈ అంశాన్ని పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసు కెళ్లామన్నారు. అమలాపురం అసెంబ్లీ పరిధిలో టీడీపీ ఎంతో పటిష్టంగా ఉందని, ప్రధానంగా ఉప్పలగుప్తం మండలంలో కూటమికి భారీ మెజారిటీ తథ్యమన్నారు. మండలంలో కొన్ని గ్రామాల బాధ్యత తాను తీసుకుంటానన్నారు. కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ తన గురువు చినరాజప్ప సహకారంతో, కూటమి కార్యకర్తల అండదండలతో ఘన విజయం సాధిస్తానన్నారు. సమావేశంలో కూటమి నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, ఆకుల సూర్యనారాయణమూర్తి, సలాది నాగరాజు, మద్దింశెట్టి సీతారామస్వామి, ఆకుల వెంకటరమణ, గుంటు ఫణిప్రసాద్, నిమ్మకాయల రాము, చిక్కం జంగమయ్య, మద్దింశెట్టి సురేష్, చీకట్ల ఏసు, అయితాబత్తుల వెంకటకృష్ణారావు, నుంకరనాయుడు, అడబాల సత్యనారాయణ, అరిగెల నరేష్, పిల్లా బుజ్జి, గుత్తాల సుభాష్‌చంద్రరావు, ఈదరపల్లి శ్రీనివాసరాజు, కుచ్చెర్లపాటి పెద్దిరాజు, ఉలిశెట్టి దొరబాబు, గొలకోటి చిన్నా, గనిశెట్టి వీరాస్వామినాయుడు, నిమ్మకాయల మను తదితరులు పాల్గొన్నారు.

కోనసీమలో రైలు కూత వినిపించడమే లక్ష్యం







ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న గంటి హరీష్‌మాధుర్, తూర్పుపాలెంలో హరీష్‌మాధుర్‌కు హారతి ఇస్తున్న మహిళ, రామచంద్రపురంలో సోదరుడు హరీష్‌మాధుర్ విజయం కోరుతూ సోదరీమణుల ప్రచారం

లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్



మోరిలో కూరగాయల దుకాణం యజమానితో మాట్లాడుతున్న గంటి హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, మే 7: రాతి యుగం పోయి స్వర్ణయుగం రావాలంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ పనులు శరవేగంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటానన్నారు. లోక్‌సభ దివంగత స్పీకర్, తన తండ్రి జీఎంసీ బాలయోగి ఆశయమైన కోనసీమలో రైలు కూత వినిపించడమే తన లక్ష్యమన్నారు. ఎన్నో రకాల వాణిజ్యపంటలతో పాటు వరి, కొబ్బరి రైతులను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం అయినవిల్లి, ముమ్మిడివరం, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో హరీష్‌మాధుర్ సుడిగాలి పర్యటన చేశారు. అయినవిల్లిలో పలు మత్స్యకార కుటుంబాల వారు సర్పంచ్ కాకర శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీలోచేరగా వారికి హరీష్‌మాధుర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మండల శాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, సయ్యపురాజు సత్యనారాయణ రాజు, కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, కుడుపూడి బుజ్జి, మట్టపర్తి రాజేశ్వరరావు పాల్గొన్నారు. ముమ్మిడివరం మండలం రాణేలంకలో పాత్రుని సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కలయికలో హరీష్‌మాధుర్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. కోనసీమను అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కలయికలో నాయకులు తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, కడలి సత్తిబాబు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, దంగేటి శ్రీనివాస్,చిక్కాల అంజిబాబు, కుంచనపల్లి నారాయణ, గోదశి గణేష్, బద్రి రమాదేవి, ముమ్మిడివరపు వరలక్ష్మి, పొత్తూరి విజయభాస్కరవర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజోలు నియోజకవర్గ పరిధిలోని తూర్పుపాలెం, మోరి, మోరిపోడు గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి దేవ వరప్రసాద్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. తూర్పుపాలెంలో హరీష్‌మాధుర్‌కు యువకులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు. ఇక మోరిపోడులో నిర్వహించిన రోడ్‌షోలో ప్రజలు హరీష్‌కు బ్రహ్మరథం పట్టారు. మోరిలో నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో ఎంపీ అభ్యర్థి హరీష్‌కు సైకిల్ గుర్తుపైన, ఎమ్మెల్యే అభ్యర్థి వరప్రసాద్‌కు గాజుగ్లాసు గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కొబ్బరి రైతులను ఆదుకునేందుకు కోకోనట్ బోర్డు ద్వారా సాయం అందేలా చేస్తానన్నారు. రాబోయే రోజుల్లో చేనేతకు పూర్వవైభవం తీసుకువస్తానన్నారు. ప్రచారంలో మండల శాఖ అధ్యక్షుడు ముప్పర్తి నాని, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు. హరీష్‌మాధుర్ విజయాన్ని కోరుతూ ఆయన సోదరీమణులు దీప్తి, రమ్య, కీర్తి రామచంద్రపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

వేట సాయం పెంపునకు వినతి

యానాం, మే7: యానాం మత్స్యశాఖ ఆధ్వర్యంలో మత్స్యకారులకు 61రోజుల వేట నిషేధ సహాయాన్ని రూ.10 వేలకు పెంచాలని పుదుచ్చేరి అన్నాడీఎంకే కార్యదర్శి అన్బళగన్ డిమాండ్ చేశారు. సీఎం ఎన్.రంగసామికి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజుకు రూ.320 చొప్పున నిషేధ కాలానికి రూ.19,500 చెల్లించాలని లేదా తమిళనాడు తరహాలో రూ.10వేలు ఇవ్వాలన్నారు.

గజదొంగను తరిమికొట్టేందుకు ప్రజలు ఏకమయ్యారు







ఈదరపల్లిలో ఆనందరావుకు అపూర్వ స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు,, గున్నేపల్లి అగ్రహారంలో ఇంటింటా ప్రచారంలో కూటమి అభ్యర్థి, కొంకాపల్లిలో ఇంటింటా ప్రచారంలో అయితాబత్తుల ఆనందరావు

అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు





టీడీపీ అభ్యర్థి ఆనందరావు, మెట్ల రమణబాబు సమక్షంలో టీడీపీలో చేరికలు, ఆనందరావును కలిసి అనుచరులతో సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్

అమలాపురం రూరల్, మే 7: రాష్ట్రంలో దోపిడీలకు అలవాటుపడ్డ గజదొంగను తరిమికొట్టేందుకు ప్రజలందరూ ఏకమయ్యారని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ప్రజల భూములను వైసీపీ నాయకులు కొట్టేసేందుకే ల్యాండ్ టైటి లింగ్ చట్టాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. ఈదరపల్లి సహా ఇతర ప్రాంతాల్లో నిర్మించిన కమ్యూనిటీ భవనాలను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రారంభిస్తామన్నారు. నల్లమిల్లిలో నిర్మించిన అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌ను సైతం అందరికీ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావులతో కలిసి కూటమి అభ్యర్థి ఆనందరావు మంగళవారం ఈదరపల్లి, సాకుర్రు, గున్నేపల్లి అగ్రహారం, పేరూరు శివారు కొంకాపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల మహిళలు హారతులు ఇచ్చి ఘనస్వాగతం పలికారు. ఈదరపల్లిలో దారి పొడువునా గజమాలలతో యువకులు సత్కరించారు. ఈసందర్భంగా పలుచోట్ల ఆయన మాట్లాడుతూ పరదాలు కట్టుకుని తిరగడం సింహం లక్షణమా అని ప్రశ్నించారు. ప్రచారంలో జనసేన నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, కొప్పుల నాగమానస, ఆకుల బుజ్జి, యేడిద శ్రీను, బీజేపీ నాయకులు నల్లా పవన్‌కుమార్, చిట్టూరి రాజేశ్వరిలతో పాటు నాయకులు చొల్లంగి సత్యసాయిబాబా, గంపల దుర్గాప్రసాద్, ముత్తాబత్తుల రమణ పాల్గొన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బుంగా సంజయ్ తదితరులు ఆనందరావును కలిసి సంఘీభావం తెలిపిప్రచారంలో పాల్గొన్నారు. కొమరగిపట్నంలో ఆనందరావు, రమణబాబు సమక్షంలో పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువాలుకప్పి ఆహ్వానించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు, మంతెన సురేష్‌రాజు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ వినియోగించుకున్న 78మంది

రాయవరం, మే 7: మండలంలోని 12 గ్రామాల్లో మంగళవారం 78మంది ఇంటి వద్దే ఓటు వేశారు. మండలంలో 80మంది హోం ఓటింగ్ సౌకర్యం పొందగా 78మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆర్ఐ పంపన రామారావు తెలిపారు. వెదురుపాకలో విజయదుర్గా పీఠాధిపతి గాడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసందర్భంగా గాడ్ మాట్లాడుతూ ఓటర్లందరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్తా





నూతన ఓటర్లను ఓటును అభ్యర్థిస్తున్న గిడ్డి సత్యనారాయణ, అంబేడ్కర్ విగ్రహానికి పూలామాలలు వేస్తున్న గిడ్డి సత్యనారాయణ



కె.ముంజవరంలో ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, మే 7: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానని పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మండలంలోని కె.ముంజవరం, వై.కొత్తపల్లి, కె.ఏనుగుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కుప్పలుతెప్పలుగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుంటామన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో అవినీతి పాలనసాగిందని, రాబోయేది అభివృద్ధి, సంక్షేమంతో కూడిన న్యాయపాలన అన్నారు. కూటమి ప్రభుత్వం గెలుపునకు ప్రజలు సహకరించాలన్నారు. కె.ముంజవరంలో గిడ్డిపై మహిళలు, యువత పూలవర్షం కురిపించి హారతులిచ్చారు. అనంతరం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించగా స్థానిక నేత దైవాల రాంబాబు నివాసం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికి సత్యనారాయణను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. టీడీపీ నాయకుడు మట్టపర్తి రామకృష్ణ నివాసం వద్ద పూలవర్షం కురిపించారు. వృద్ధులను కలిసి వృద్ధాప్యంలో తోడుంటామని, యువ ఓటర్లను కలిసి మీభవిష్యత్తుకు మేం భరోసా ఇస్తామని సత్యనారాయణ ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో నియోజ కవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, కుంపట్ల నాగలక్ష్మి, మట్టపర్తి రామకృష్ణ, అంబటి భూలక్ష్మి, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, మట్టపర్తి మణికంఠ, దైవాల రాంబాబు, బొరుసు సత్యనారా యణ, ఉంగ్రాజవరపు ప్రసాద్ పాల్గొన్నారు.

గంగలకుర్రు అగ్రహారంలో గిడ్డి ప్రచారం...

గంగలకుర్రుఅగ్రహారంలో కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ ఇంటింటికీతిరిగి ఓట్లు అభ్యర్థించారు. సొసైటీ ఛైర్మన్ మట్టపర్తి చంద్రశేఖర్, అడపా బాబ్జీ, మంద నాగరాజు, చిక్కాల వెంకటేశ్వరరావు, అల్లాడ రవి, బందన రాంబాబు, రాయుడు దుర్గారావు, మట్టపర్తి రెడ్డమ్మ, సతీష్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



కొత్తపేట, ఏప్రిల్ 7: కూటమి విజయానికి టీడీపీలో చేరికలే నిదర్శనమని ఆ పార్టీ కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. పలివెలలో వైసీపీకి చెందిన సొసైటీ మాజీ డైరెక్టర్ గొలకోటి సత్యప్రసాద్, మాజీ ఎంపీటీసీ పెరుమాళ్ల సహా 15కుటుంబాల వారు మంగళవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి సత్యానందరావు పార్టీకండువాలు వేసి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమిపై విశ్వాసంతో ప్రజలు ముందుకు వస్తున్నారన్నారు. కొత్తపేట అసెంబ్లీ అభ్యర్థిగా తనను, అమలాపురం లోక్‌సభ అభ్యర్థిగా గంటి హరీష్‌మాధుర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

బండారుకు మద్దతుగా బీజేపీ ప్రచారం

ఆత్రేయపురం, మే 7: కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు, అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లను గెలిపించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం మంగళవారం ప్రచారం నిర్వహించారు. అంకంపాలెంలో బ్రాహ్మణులు, ఆర్యవైశ్య కుటుంబాలను కలిసి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.శ్రీనివాస్, యువమోర్చా రాష్ట్ర ప్రతినిధి పాలూరి జయప్రకాష్ పాల్గొన్నారు.

దోచుకోవడానికే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు

రాజోలు, మే 7: రాష్ట్రంలో ప్రజల భూములు దోచుకోవడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తీసుకువచ్చారని రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు తీవ్రంగా విమర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. రామ్మోహనరావు మాట్లాడుతూ దేశంలో ఏఒక్క రాష్ట్రంలో కూడా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు చట్టాన్ని ఏప్రభుత్వం తీసుకురాలేదన్నారు. ఎంపీపీ కేతా శ్రీను, ముదునూరి చినబాబురాజు, టీడీపీ మండల అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, మంగెన భూదేవి, బందెల పద్మ, చెల్లింగి సత్యనారాయణ, గెడ్డం సింహ, సర్పంచ్ ముదునూరి పాల్గొన్నారు.

నూరుశాతం విద్యాకానుక కిట్లను అందిస్తాం

అంబాజీపేట, మే 7: విద్యార్థులందరికి నూరుశాతం విద్యాకానుక కిట్లను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు వీర వెంకటసత్యనారాయణ అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం హెచ్ఎం, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు.

టీడీపీలో చేరికలు

రావులపాలెం, మే 7: దేవరపల్లి శివారు చెల్లిరేవుకు చెందిన చిట్టూరి శ్రీనివాసు, నీలా సతీష్, బొక్కా వీరభద్రుడు, వాసంశెట్టి మణికంఠ, కుడుపూడి రామకృష్ణ, కుడుపూడి వేబిజ్, కట్టా దుర్గాప్రసాద్‌తో పాటు పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి బండారు సత్యానందరావు, అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



టీడీపీలో చేరిన ఓదూరు సర్పంచ్



ద్రాక్షారామ, మే 7: ఓదూరు సర్పంచ్ వింజమళ్ల విమలకుమారి, వార్డు సభ్యులు గంటి రత్నకుమారి, మాజీ సర్పంచ్ కొండేపూడి నారాయణరావు, మోటూరి వెంకటరమణ తదితరులు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఓదూరులో జరిగిన కార్యక్రమంలో వీరికి కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాస్ తండ్రి సత్యం, టీడీపీ నాయకులు చింతపల్లి వీరభద్రరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు కొమరిన వీర్రాజు, గరిగిపాటి సూర్యనారాయణ, చుండ్రు వీర్రాజు చౌదరి, కొండేపూడి సురేష్ సమక్షంలో చేరారు. వీరికి వాసంశెట్టి సత్యం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చోడవరానికి చెందిన పీఏసీసీఎస్ మాజీ డైరెక్టరు పిల్లి రాఘవ, న్యాయవాది చింతపల్లి శ్రీనివాస్ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో బిక్కిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నమూనా ఈవీఎంతో ఓటర్లకు అవగాహన

మామిడికుదురు, మే 7: పి.గన్నవరం నియోజకవర్గ కూటమి నాయకులు నమూనా ఈవీఎంతో ఓటర్లకు అవగాహన కల్పిస్తూ మంగళవారం ప్రచారం నిర్వహించారు. పాశర్లపూడిలో నియోజకవర్గ టూమెన్ కమిటీ సభ్యుడు నామన రాంబాబు ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి సత్యనారాయణను గెలిపించాలని, తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బుచ్చిబాబుకు రజకుల మద్దతు

కాట్రేనికోన, మే 7: అంబేడ్కర్ కోనసీమ జిల్లా రజక సంఘ నాయకులు మంగళవారం చెయ్యేరులో ముమ్మిడివరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబుకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తామంతా కూటమి వైపే ఉన్నామని తెలిపారు. తమ సమస్యలను బుచ్చిబాబుకు వివరించారు. కూటమి అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తానని బుచ్చిబాబు వారికి హామీ ఇచ్చారు. పేట ఏడుకొండలు, నేదునూరు కళ్యాణ్, మాచవరపు కాశి, నేదునూరి వెంకటరమణ, సామంతకుర్తి ఈశ్వరరావు, సామంతకుర్తి పండు, గొల్లపల్లి ధర్మారావు, అధికారపు వీరవెంకటసత్యనారాయణ, కోటిపల్లి సత్యనారాయణ, కోటిపల్లి రాంబాబు, కేశనకుర్తి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనలో చేరిన వైసీపీ కార్యకర్తలు

ఉప్పలగుప్తం, మే 7: అమలాపురం అసెంబ్లీ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు తనయుడు కరణ్ మంగళవారం వానపల్లిపాలెంలో సర్పంచ్ నల్లా బాబండి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నల్లా నాగబాబు, దున్నాల ఆదిబాబు, ఆకుల నారాయణరావు, నల్లా బాలు, నల్లా సూర్యనారాయణ, కుచ్చెర్లపాటి పెద్దిరాజు, నల్లా వెంకటచింతన్న పాల్గొన్నారు. వైసీపీ కార్యకర్తలు పలువురు నల్లా బాబండి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనల్లో చేరారు. చేరిన వారిలో నల్లా నరసింహారావు, నల్లా సురేష్, పోతురాజు ప్రసాద్, గొలకోటి సత్తిబాబు, పులిక వెంకటేశ్వరరావు, నల్లా కృష్ణ, నల్లా ఏసురాజు, చిల్లా రాజేష్, వున్నారు.

సుభాష్ ఎన్నికల ప్రచారం

ద్రాక్షారామ, మే 7: కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ మంగళవారం ఉదయం రామచంద్రపురం పట్టణంలో 3 నుంచి 10 వార్డులో ఎన్నికల ప్రచారం జరిపారు. తెలుగుదేశం పార్టీకి ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.